# గట్టివాడు

జీడిగుంట రామచంద్రమూర్తి

చెన్నకేశవస్వామి అయిదో కూతురు అలివేలు పెద్దమనిషయింది. పెళ్ళి చేయాలంటే డబ్బు కావాలి ఆ వూరి కాలవ మీద వంతెన కోసం మళ్ళీ ప్రభుత్వాన్నే డబ్బు అడిగితే - తీగలాగినట్లవుతుందని బెదిరిపోతున్నాడు- చెన్నకేశవస్వామి!

* * *

చెన్నకేశవస్వామి చాలా గట్టివాడు....

అలా అని లావుగా, పుష్టిగా వుంటాడను కోవటం పొరపాటు. చాలా బక్కపల్చగా- తుఫాను గాలికి ఎగిరి పోయేలా వుంటాడు. అందుకే ఎప్పుడైనా, ఎక్కడైనా తీర ప్రాంతాల్లో వాయుగుండం ఏర్పడిందనీ, బోలెడు కిలోమీటర్ల వేగంతో పెనుగాలులు వీస్తాయనీ రేడియో వాతావరణంలో చెప్పారంటే- ఆ సమయంలో బయటకు వెళ్ళటానికే భయపడిపోతాడు.

చెన్నకేశవస్వామి గట్టివాడే కాదు.... పొట్టివాడు కూడానూ!

అతని పొట్టనిండా పుట్టెడు బుద్ధులున్నాయని చాలా మంది చెబుతూంటారు. కానీ అతని పొట్ట మాత్రం ఎప్పుడూ వీపుని అతుక్కుపోయే వుంటుంది. అలా అని తిండికిలేని పేదవాడను కోవటం మరో పొరపాటు.

తాత ముత్తాతల నుంచీ వస్తున్న ఆస్థిపాస్తులతోబాటు వ్యవసాయం మీద బాగానే సంపాదించాడు. అదలా వుండగా ఇటు రాజకీయాల్లోకి కూడా ప్రవేశించి- మరింతగా సంపాదిస్తున్నాడు.

అయితే, అతను రాజకీయాల్లో చేరటం వల్ల సంపాదిస్తున్నాడా? లేక సంపాదించటం కోసమే రాజకీయాల్లో చేరాడా? అని మాత్రం అడక్కండి. ఎటొచ్చి, రాజ

క్రియాల్లో చేరటానికి కారణమయితే వుంది.

ఆ వూళ్ళో సేతుమాధవరావ్ అనే మరో మోతుబరి ఒకాయన వున్నాడు. సేతుమాధవరావ్‌కీ- చెన్నకేశవస్వామికీ మధ్య పచ్చ గడ్డి వేస్తే- భగ్గుమంటుంది. ఒక ఇంటి మీద వాలిన ఎలాంటి పక్షి అయినా సరే- మరో ఇంటి మీద వాలకుండా కాపలా కాయటానికి గాను, ఇద్దరూ ప్రత్యేకంగా మనుషుల్ని పెట్టుకున్నారు. ఆ కాపలా మనుషులిద్దరూ ఆప్త మిత్రులే అయినప్పటికీ- వీళ్ళ ఇళ్ళల్లో కుదురు కున్నాక- బద్ధ శత్రువులుగా మారి పోయారు!....

సరే....వాళ్ళను వదిలేద్దాం!

వినాయక చవితి వచ్చిందంటే ఆ వూళ్ళో రెండు పందిళ్ళు వెలి సేవి. ఒకటి చెన్నకేశవస్వామిది, రెండోది సేతుమాధవరావుది.... పోటాపోటీలు మీద- ఇద్దరూ ప్రోగ్రాములు పెట్టించే వారు. ఒకళ్ళు పీసపాటివారి 'కురుక్షేత్రం' ఆడిస్తే- ఇంకొకళ్ళు 'కూచిపూడి వారి భామా కలాపం' ఏర్పాటు చేయించే వారు.

ఈ ఇద్దరికీ వైరం వుంటే వుండు గాక- వూరి వారికి మాత్రం వీరిద్దరి వల్లా వూహించని ఉపకారాలెన్నో జరిగిపోతూండేవి.

ఒకసారి అక్కడి పంచాయతీకి జరిగిన ఎలక్షన్లలో- సేతుమాధవరావు ప్రెసిడెంటు పదవికి నిల బడ్డాడు....అంతే! అర్జంటుగా చెన్నకేశవస్వామి కూడా నామినేషన్ దాఖలు చేసి పోటీకి తల పడ్డాడు.

మెడ్రాసు నుంచి సినిమా వాళ్ళను తీసుకొచ్చి- ప్రాపగాండా చేయించాడు సేతుమాధవరావు.

చెన్నకేశవస్వామి తక్కువ తిన్నాడా? బొంబాయి నుంచి హిందీ నాట్య తారల్ని తీసుకొచ్చి డాన్సు చేయించాడు.

కనపడిన ప్రతి వాడికీ నమస్కారం పెట్టి- ఓటియ్యమని సేతుమాధవరావ్ అడిగితే, కన పడని వాళ్ళ ఓట్లు కూడా తనకు పడటానికి కావలసిన ఏర్పాట్లు చేసుకున్నాడు చెన్నకేశవస్వామి. ఇద్దరూ కూడా పోటీలు పడి నోట్లు పంచారు.... 'ఓటు విలువ' ఎంతటిదో- ఆ వూళ్ళో చాలా మంది వీళ్ళ ధర్మమా అని తెలుసు కున్నారు.

కానీ గమ్మత్తేమిటంటే- ఆ వూళ్ళో వున్న ఓట్లన్నీ వీళ్ళిద్దరికీ కాకుండా- మూడో వాడికెవరికో పడ్డాయి.



మొత్తం మీద- ఎలక్షన్‌లో గెలవకపోయినా- రాజకీయమంటే ఏమిటో ఇద్దరికీ స్పష్టంగా అర్థమయి పోయింది. రాత్రికి రాత్రి ఏమనుకున్నారో ఏం పాడో- ఇద్దరూ కలిసి ఒక్కటై పోయారు.

అలా ఒకటయ్యాక- ఎలక్షన్ పేరుతో- ఒక్కొక్కరికి ఎంతెంత ఖర్చయిందో లెక్కలు చూసుకున్నారు. ఖర్చయిన సొమ్మును పూడ్చుకోటానికి- మార్గాలు వెతుక్కున్నారు. ఎవరి మార్గాన వారు సంపాదిస్తూనే వున్నారు. అవసరమయినప్పుడల్లా ఒకరికొకరు సాయం చేసుకుంటున్నారు.

ఆ విధంగా రోజులు గడిచిపోతూండగా చెన్నకేశవస్వామికి ఓ చిన్న ఆపద వచ్చింది. ఆపదంటే మరేమీ ప్రమాదకరమయిందేమీ కాదు. అతని నాలుగో కూతురు నాగరత్నం వున్నట్టుండి పెద్దమనిషై కూర్చుంది.

అంతకు ముందు, ముగ్గురు కూతుళ్ళు- అలా పెద్ద మనుషులవగానే- ఇలా పెద్ద పెద్ద సంబంధాలు తెచ్చి పెళ్ళిళ్ళు చేసేశాడు చెన్నకేశవస్వామి.

కానీ ఈ మధ్య ఎలక్షన్ల గొడవల్లో పడి- డబ్బుని కాలవ నీళ్ళల్లా ఖర్చు చేయటం వల్ల- కొంచెం దెబ్బతిన్నాడు. ఇప్పుడు పెద్దమనిషై కూర్చున్న నాగరత్నానికి సంబంధం రెడీగానే వుంది. వెంటనే పెళ్ళి చేసేయాలని అతని సంకల్పం....కానీ తన హోదాకు తగినట్లు చేయాలంటే- ఎంత లేదన్నా- కట్నం కానుకలకు. ఖర్చునకూ కలిపి- అధమం ఏభై వేలు కావాలి.

అక్కలకు జరిగినట్లు జరక్కపోతే- ముందు పసిపిల్ల మనసు కష్టపెట్టుకుంటుంది కదా?

అంత డబ్బు చేతిలో లేదు చెన్నకేశవస్వామికి .... బ్యాంకు లోనూ లేదు!.... ఇంత బ్రతుకూ బ్రతికి- తాను ఇప్పుడు అప్పుచేయలేడు. పోనీ వున్న పొలంలో కొంత మేర అమ్మినా, అదీ తన పరువుకు నష్టమే!.... కూతురు పెళ్ళి చేయుటం కోసం బంగారం లాంటి పొలం అమ్ముకున్నాడని రేపు అయినవాళ్ళూ, కానివాళ్ళూ యాగీ చేయవచ్చు.

అందుకే ఏం చేయాలా అని ఆలోచించాడు.... పొట్టివాడు కాబట్టి గట్టి ఆలోచనే వచ్చింది.

ఆ వూరు, జిల్లా హెడ్క్వార్టర్స్‌కి ముప్ఫయ్ మైళ్ళ దూరంలో వుంది....బస్సులు తరచుగా నడుస్తూనే వుంటాయి. కానీ, ఆ వూరి తూర్పు దిక్కున వున్న కాలవమీద వంతెన నిర్మిస్తే-అట్నుంటి జిల్లా హెడ్క్వార్టర్స్‌కి పన్నెండు మైళ్ళే వుంటుంది.

అలా వంతెన నిర్మించటంవల్ల తమ ప్రజలకు మహామేలు కలుగు




తుందనీ, వెంటనే ఆ ఏర్పాట్లు చేయించమనీ, ప్రభుత్వానికి ఓ వినతి పత్రంరాసి-దానిమీద ఊరి ప్రజలు చాలా మంది చేత దస్కత్తులు చేయించి, దాఖలు చేశాడు. అది, ఓ బల్ల మీద నుంచి మరో బల్లమీదకు మారుతున్నప్పుడల్లా - పొరపాటున ఎగిరిపోయి చెత్త బుట్టలో పడకుండా-బరువులు పెట్టుకుంటూ వచ్చాడు.... మొత్తానికి మూడు నెలల్లో దాని మీద ఆమోద ముద్ర పడింది.

పైనా కిందా పెట్టి, ఆ వంతెన నిర్మించటానికి తానే కంట్రాక్టు కూడా సంపాదించాడు.... ఆ కాలవ మీద వంతెన కట్టి- అక్కడినుంచి 'అప్రోచ్' రోడ్ వేయటానికి గాను ప్రభుత్వం తాత్కాలికంగా లక్ష రూపాయలు మంజూరు చేసింది.

ముందుగా, అందులో పదివేలు ఖర్చు పెట్టి కొన్ని సిమెంటు బస్తాలూ, ఇసుకా-కంకరా, మొదలయిన వన్నీ తెప్పించాడు చెన్న కేశవస్వామి.

కాలవ మీద వంతెన కడుతున్న విషయం ఆ వూళ్ళో చాలా మందికి తెలియకపోలేదు.... అయితే, అది వరకే ప్రభుత్వం అలాంటి నిర్ణయాలు తీసుకోవటం-అంతవరకూ ఎలాంటి పనీ జరక్కపోవటం వల్ల ఇప్పుడు కూడా అంతగా నమ్మకం కుదరక- ఉదాసీనంగా వుండిపోయారు.

వారాలూ, నెలలూ గడచిపోయాయి .... అయినా ఎలాంటి పనీ ప్రారంభం కాలేదు.

ఈ లోగా చెన్నకేశవస్వామి-నాగరత్నం పెళ్ళికి సన్నాహాలు ప్రారంభించాడు.... అనుకున్న సంబంధాన్ని ఖాయ పరిచాడు.అయినా, వంతెన పని ప్రారంభించలేదు.

నాగరత్నం పెళ్ళి వైభవంగా జరిగిపోయింది .... వంతెన పని మాత్రం మొదలవలేదు.

ఆ వూళ్ళో చాలామంది, ఆ విషయమే మర్చిపోయారు .... కానీ కాగితాలమీద వున్నది ఎలా చెరిగి పోతుంది?....వంతెన పని ఎలా సాగుతోందో చూడటానికి రెండు మూడు సార్లు అధికారులు వచ్చారు. వాళ్ళందరికీ ఓసారి సిమెంటూ, మరోసారి ఇసుకా-కంకరా చూపించాడు చెన్నకేశవస్వామి.

"అవికాకుండా ఇంకేం లేదా?" అని మూడోసారి వచ్చినప్పుడు వాళ్ళు ఆకలిగా అడిగితే, ఏదో ఆశ చూపించాడు వాళ్ళకి. దాంతో వాళ్ళు ఆకలి తీర్చుకుని వెళ్ళారు.

కానీ ఎంత కాలమని, ఎందరి ఆకలి తీర్చగలడు? అందుకే మళ్ళీ ఆలోచించాడు.

ఆఖరికి - ఆలోచించి, ఆలోచించి, ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

ఒకే ఒక వాక్యం—

"ఈ వూళ్ళో భూకంపం వల్ల ఈ వూరి కాలవమీద నిర్మాణం పూర్తి కావస్తున్న వంతెన, పూర్తిగా కూలిపోయింది" అని రాసి - పై అధికారులకు టెలిగ్రాం కొట్టాడు.

టెలిగ్రాం అందుకున్న ఆరు నెలలకు అధికారులు ఆ వూరికి వచ్చారు. దర్యాప్తు జరిపారు. "ఎక్కడా రాని భూకంపం అక్కడే ఆ వూళ్ళోనే ఎందుకు రావాలి?" అని తర్జన భర్జనలు చేసుకున్నారు. ఆఖరికి రిపోర్టులో ఇలా రాశారు—

"ఈ వూళ్ళో భూకంపం వచ్చి వంతెన తప్పకుండా కూలి పోయిందనే మేం గట్టిగా నమ్ముతున్నాం. ఇందులో అనుమానించటానికి ఎలాంటి ఆధారాలు కనిపించటం లేదు. అందుకే- మాకు ఇక్కడ వంతెన కనిపించలేదు"—

అంతే!!....

ఆ తరువాత చాలాకాలం చెన్నకేశవస్వామి నిశ్చింతగా నిద్ర పోయాడు.

ఇప్పుడు మళ్ళీ అనుకోకుండా అతని ఆయిదో కూతురు అలివేలు పెద్దమనిషై కూర్చుంది. పెళ్ళి చేయాలంటే డబ్బుకావాలి! ఆ వూరి కాలవమీద వంతెన కోసం మళ్ళీ ప్రభుత్వాన్నే డబ్బు అడిగితే తీగలాగినట్లు అవుతుందని బెదిరి పోతున్నాడు చెన్నకేశవస్వామి! *

(చిన్న మనవి: ఇది సరదాగా రాసిన వ్యంగ్య రచన. —రచయిత)

Published by K. Rajendra Babu, 80, Dhanalaxmi Colony, Madras-600 026. and Printed, by Vijaya Bapineedu at Vijaya Graphics, 8, Arcot Road, Madras-600 026. Phone: 422233
Editor: VIJAYA BAPINEEDU.